ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శుక్రవారం 20 సెప్టెంబరు 2024 | 3





నేటి నుంచి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు

కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి వంద రోజులు పూర్తయిన నేపథ్యంలో ఆ పార్టీల శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. చంద్రబాబు వంద రోజుల పాలనపై క్యాడర్ ఖుషీగా ఉంది. టీడీపీతో పాటు జనసేన, బీజేపీ నేతలు వంద రోజుల పాలన విజయోత్సవాలను ప్రారంభించారు. ప్రతికూల పరిస్థితుల్లో ప్రభుత్వ బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు వంద రోజుల్లో ఎంతో సమయస్ఫూర్తి, నేర్పరితనంతో విజయవంతంగా ప్రజారంజక పాలనను సాగించారు.

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు పూర్తయిన సందర్భంగా నేతలు శుక్రవారం నుంచి ప్రజల్లోకి వెళ్లి తమ ప్రభుత్వ కార్యక్రమాలను వివరించనున్నారు.


కొత్తపేట నియోజకవర్గం వానపల్లి గ్రామసభలో చంద్రబాబు(ఫైల్)







100 రోజుల ప్రభుత్వ పాలనకు మంచి మార్కులు

సంక్షోభంలోనూ ఆర్థిక అవస్థల్లోనూ సంక్షేమం అభివృద్ధి

జనరంజక పాలనకు వంద రోజులు

ఉత్సాహంగా పనిచేసిన కూటమి ప్రభుత్వం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

పింఛన్ల పంపిణీ, ఫస్ట్ తారీఖునే ఉద్యోగులకు జీతాలు అందించడంతో పాటు గత వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేసిన ఎన్నో పథకాలను పునరుద్ధరించి అమలులోకి తీసుకువచ్చారు. వీటికి తోడు వైఎస్ జగన్, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేర్లతో అమలు చేసిన పథకాల పేర్లను ప్రజాకాంక్షలకు అనుగుణంగా మార్పులు చేస్తూ అమలులోకి తెస్తున్నారు. సర్వే రాళ్లపై అప్పటి సీఎం జగన్ ఫొటోతో తయారు చేయించిన వందల కోట్ల విలువైన రాళ్లను దుర్వినియోగం చేయకుండా వినియోగించేలా ఆ పథకం పేరును మార్పు చేయడంతో పాటు ఆ రాళ్లను కూడా ఉపయోగించేందుకు చంద్రబాబు తీసుకున్న నిర్ణయం పట్ల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు ఎన్నో సంక్షేమ పథకాల అభివృద్ధి పేర్లను మార్పు చేశారు. దీనిలో భాగంగా పాఠశాలలో జగనన్న గోరుముద్ద పేరును తొలగించి అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన డొక్కా సీతమ్మ పేరును మధ్యాహ్న భోజన పథకానికి అమలులోకి తెచ్చారు. చంద్రబాబుతో పాటు జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సంయుక్తంగా రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి.

పెరిగిన పింఛన్లు

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే వృద్ధులకు గత పెన్షన్‌తో కలిపి మూడు నెలలు పింఛను రూ.7వేలును జూన్ నెలలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సెప్టెంబరు నెలలో అయితే ఒకరోజు ముందుగానే ఆగస్టు 31వ తేదీన లబ్ధిదారులకు అందాల్సిన పెన్షన్లు పంపిణీ చేసి రికార్డు సృష్టించారు. జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటరీ వ్యవస్థతో సంబంధం లేకుండానే పేదలకు పెన్షన్, రేషన్‌ల పంపిణీతో సహా ఇతర కార్యక్రమాలన్నీ యథావిధిగా కొనసాగుతున్నాయి.



1నే జీతాలు

గత ప్రభుత్వ తీరుకు భిన్నంగా ఉద్యోగులకు ప్రతీ నెల 1వ తేదీనే జీతాలు, విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్లను విడుదల చేసేలా చంద్రబాబు ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఉచిత ఇసుక



గ్రామ సభల నిర్వహణ

రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలోనే గ్రామ సభలను ఆగస్టు 23వ తేదీన నిర్వహించారు. అదే సమయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పంచాయతీల్లోను ఈ గ్రామ సభలు జరిగాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొత్తపేట నియోజకవర్గం స్వర్ణ వానపల్లి గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వానపల్లి పళ్లాలమ్మ ఆలయం అభివృద్ధితో పాటు సుమారు రూ.10 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు చంద్రబాబు హామీ ఇచ్చారు.

ఆర్థిక సంఘం నిధుల విడుదల

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 15వ ఆర్థిక సంఘం నిధులను జనాభా ఆధారంగా పంచాయతీలకు నేరుగా విడుదల చేశారు. దాంతో పంచాయతీల్లో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో కనీసం విద్యుత్ బిల్లులు చెల్లించడానికి కూడా డబ్బులు లేవు. ఈ నేపథ్యంలో పంచాయతీలు ఉత్సవ విగ్రహాల్లా మారిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీలకు చట్టబద్ధంగా రావాల్సిన నిధులను విడుదల చేయడంతో సర్పంచులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

డ్రెయిన్ల ముంపు నుంచి రక్షణ

ఇక కోనసీమలోని డ్రెయిన్ల ముంపు నుంచి విముక్తి కలిగించేందుకు కూనవరం స్ట్రయిట్ కట్, రామేశ్వరం మొగను లక్షలు వెచ్చించి అభివృద్ధి చేశారు. వరదల సమయంలో బలహీన ఏటిగట్లను పటిష్టంగా ఉండేందుకు చేపట్టాల్సిన మరమ్మతులు, ఇతర పటిష్ట పనుల కోసం ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్లు కేటాయించింది.

పర్యాటక కేంద్రంగా పిచ్చుకలంక


బొబ్బర్లంక సమీపంలోని పిచ్చుకలంకను పర్యాటక ప్రాజెక్టుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు పలువురు అధికారులు, పారిశ్రామికవేత్తలు ఆ ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించి ప్రాజెక్టు అమలుకు సానుకూలతను ప్రదర్శించడం హర్షణీయ పరిణామం.

రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు..

కాంగ్రెస్ ఆందోళన


ఆందోళన నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 19: శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు రాహుల్‌గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లాశాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో గురువారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు. తక్షణం రాహుల్‌గాంధీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలను నిరసించారు. రాబోయే కాలంలో దేశానికి రాహుల్‌గాంధీ ప్రధాని కానున్నారని చిట్టిబాబు పేర్కొన్నారు. మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల సుభాషిణీ, నాయకులు వంటెద్దు బాబీ, కోట శ్రీనివాస్, పాలెపు ధర్మారావు, సరెళ్ల ప్రసన్నకుమార్, కుడుపూడి శ్రీనివాస్, మహ్మద్ ఆరిఫ్, రాయుడు వెంకటరమణ, మహబూబ్ షకీలా, మొల్లేటి వెంకటేశ్వరరావు, అప్పన శ్రీరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


అమరావతి నుంచి వీసీలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు


పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప, కలెక్టర్ మహేష్

పారదర్శకంగా

ఇసుక పాలసీ

అమలాపురం టౌన్, సెప్టెంబరు 19: ఎటువంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా అత్యంత పారదర్శకంగా ఉచిత ఇసుక పాలసీని అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్లకు సూచించారు. అమరావతి నుంచి చంద్రబాబు గురువారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఇసుక నిర్వహణ వ్యవస్థపై నూతనంగా రూపొందించిన ఆన్‌లైన్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. అక్టోబరు 15 నుంచి పూర్తి స్థాయిలో రీచ్‌లల్లో, యార్డుల్లో డిమాండ్‌కు సరిపడా ఇసుక అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇసుక పారదర్శకంగా లభిస్తుందన్న నమ్మకాన్ని ప్రజల్లో పెంపొందించాలని ఆయన సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డీపీవో దిడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ అక్రమ నిల్వలపై

విజిలెన్స్ దాడులు

రావులపాలెం, సెప్టెంబరు 19: ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆయిల్ స్థావరంపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. విజిలెన్స్ ఎస్పీ కేఎస్‌ఎస్వీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ, విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. రావులపాలెం మండలం రావులపాడులో నంబూరి రామమురళీమోహన్ ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఆయిల్ నిల్వ ఉంచారు. దీంతో దాడి చేసి 19వేల లీటర్ల సాల్‌వెంట్ ఆయిల్, 1800 లీటర్ల ఉపయోగించిన మడ్డి ఆయిల్, ఒక ఆయిల్ ట్యాంకర్‌ను సీజ్ చేశామన్నారు. వీటి విలువ రూ.38,95,704గా నిర్ధారించామన్నారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడులలో అధికారులు నాగవెంకట్రాజు, విజయకుమార్, వీరబాబు, లోవరాజు, జీవానందం, శివ తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో స్వర్ణాంధ్ర-2047

ప్రజలకు అందుబాటులో విజన్ ముసాయిదా

అమలాపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నీతి అయోగ్ సహకారంతో రూపొందించిన స్వర్ణాంధ్ర-2047 విజన్ ముసాయిదా నివేదికను ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రూపొందించిన వెబ్‌సైట్‌లో ప్రజలందరికీ అందుబాటులో ఉంచినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ చెప్పారు. అన్నివర్గాల ప్రజల సలహాలు, సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దీనికి అనుగుణంగా వచ్చే ఐదేళ్లలో జిల్లా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించగా కలెక్టరేట్ నుంచి మహేష్‌కుమార్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ ముసాయిదాకు అనుగుణంగా జిల్లా, మండలస్థాయిల్లో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించే అంశాలపై కలెక్టర్లకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ నెల 21 నుంచి అక్టోబరు 5 వరకు విజన్ ముసాయిదా ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. నెలాఖరు నాటికి మండలస్థాయిలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. స్థానికంగా లభించే వనరులు, విలువ ఆధారిత పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయ, ఉద్యాన, ఆక్వారంగం తదితర అంశాలను పొందుపరుస్తూ జిల్లా యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేయాలని కలెక్టర్లకు సూచించారు. పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను సేకరించి క్రోడీ కరించాలన్నారు. దీనిలో భాగంగా పాఠశాల, ఇంటర్మీడియట్ స్థాయిల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా అధికారులందరికీ సీపీవో సహకరిస్తారని, మండల, జిల్లా స్థాయిల్లో డేటా సమగ్రత స్థిరత్వాన్ని పక్కాగా నిర్ధారించుకోవాలన్నారు. తుది ముసాయిదాను అక్టోబరు 22న ముఖ్యమంత్రికి సమర్పిస్తామన్నారు. 2024-29 జిల్లా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి సమ్మిళిత వృద్ధి సాధనకు అందరూ అంకితభావంతో కృషి చేయాలని కోరారు.


కలెక్టర్ మహేష్‌కుమార్


ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

అంకంపాలెం ఇసుక ర్యాంపు నిర్వహణపై

ప్రజాభిప్రాయ సేకరణ

ఆత్రేయపురం, సెప్టెంబరు 19: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెం ఇసుక ర్యాంపు నిర్వహణపై గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ పి.నిషాంతి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం అంకంపాలెం ఇసుక ర్యాంపు ఏర్పాటుకు చర్యలు చేపడుతుందని అభ్యంతరాలు ఉన్నట్లైతే ప్రజావేదిక ద్వారా తమ అభిప్రాయాలు వ్యక్తం చేయాలన్నారు. అంకంపాలెం రీచ్‌లో 9.85 హెక్టార్లలో 98,540 క్యూబిక్ మీటర్లలో ఇసుక తవ్వకాలకు ప్రతిపాదనలు చేశారన్నారు. అనంతరం గ్రామస్థులు తమ అభిప్రాయాలను జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. ఇసుక ర్యాంపు ఏర్పాటు చేయడానికి అభ్యంతరాలు ఏమీ లేవని భారీ లారీలు తిరగడం వల్ల రోడ్లు పాడైపోతోందని వివరించారు. ర్యాంపులో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అంకంపాలెం-ర్యాలి గ్రామాల వద్ద బలహీనంగా ఉన్న వంతెనలను పటిష్టం చేయాలని కోరారు. తద్వారా ఆయా పనులు చేపట్టి ర్యాంపు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ మైన్స్ సాయి రామ్‌సింగ్, ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దారు రాజేశ్వరరావు, జడ్పీటీసీ బోనం సాయిబాబా, సర్పంచ్ ముత్తాబత్తుల రాజు, గ్రామ పెద్దలు కుదప కృష్ణమూర్తి, కరుటూరి వరప్రసాద్, కరుటూరి రవి పాల్గొన్నారు.



పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్


భోజనం రుచి చూస్తున్న నేతలు

ముమ్మిడివరంలో అన్న క్యాంటీన్ ప్రారంభం

ముమ్మిడివరం, సెప్టెంబరు 19: పేదల ఆకలిని తీర్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూ.5కే ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారని ఎంపీ, హరీష్‌మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ బళ్లగేటు సెంటర్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీనును గురువారం రాత్రి ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బుచ్చిబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి విడతగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయగా రెండో విడతగా గురువారం 75 అన్న క్యాంటీన్లను ప్రారంభించారన్నారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా ఉదయం రూ.5కే అల్పాహారం, రూ.5కు మధ్యాహ్న భోజనం, రూ.5కు సాయంత్రం భోజనం అందిస్తారని చెప్పారు. అనంతరం ఆహార పదార్థాలను రుచి చూసి అక్కడికి వచ్చిన వారికి స్వయంగా భోజనాలు వడ్డించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాయకులు గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు, వేగిరౌతు రాజబాబు, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, చిక్కాల అంజిబాబు, చిలువూరి సతీష్‌రాజు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, దాట్ల పృథ్విరాజ్, టేకుమూడి లక్ష్మణరావు, సాగిరాజు సూరిబాబురాజు, దాట్ల బాబు, ధూలిపూడి బాబి తదితరులు పాల్గొన్నారు.



పుష్కరాల నాటికి ఈస్ట్ రైల్వేస్టేషన్ అభివృద్ధి

రూ.280 కోట్లతో ఆధునికీకరణ

ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

5లో



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

శృంగారవల్లభ స్వామి హుండీల ఆదాయం

రూ.19.31 లక్షలు

పెద్దాపురం, సెప్టెంబరు 19: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తిరుపతి శృంగారవల్లభ స్వామి ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో గురు వారం తెరిచి లెక్కించారు. 79 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.13,12,116, అన్నదాన హుండీల ద్వారా రూ.6,19,580... మొత్తం రూ.19,31,696 ఆదాయం వచ్చిందని ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. లెక్కింపులో మరిడమ్మ దేవస్థానం సహాయ కమిషనరు చేబ్రోలు రామ్మోహనరావు, దేవదాయ శాఖ ప్రాంతీయ తనిఖీదారు సీహెచ్ ఉదయ్‌బాబు నాయుడు, తిరుపతి గ్రామ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు మాధురీప్రకాష్‌లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వేద విద్యనభ్యసించిన నిరుద్యోగ యువతకు భృతి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేద విద్యలో ఉత్తీర్ణత పొంది నిరుద్యోగులుగా ఉన్న వారు నెలకు రూ.3వేలు భృతి పొందేందుకు అర్హులు. ఆసక్తి గల నిరుద్యోగ వేద పండితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా దేవదాయ శాఖ అధికారి వి.సోమరాజు తెలిపారు. వేద విద్య సర్టిఫికెట్ నకలు, ఆధార్ నకలు, ఏ విధమైన ఉద్యోగం లేదని స్వీయ ధ్రువపత్రం దరఖాస్తుకు జత చేసి రాజమహేంద్రవరంలోని జిల్లా దేవదాయ శాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5గంటలలోపు అందించాలని సూచించారు. మరింత సమాచారం కోసం 0883-2478375 నెంబరును సంప్రదించాలని కోరారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మృధు హాసిని

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు

గిరిజన విద్యార్థుల ఎంపిక

అడ్డతీగల, సెప్టెంబరు 19: మండలంలోని వేటమామిడి హోసన్నా పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ మృధుహాసిని తెలిపారు. కాకినాడలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అభిషేక్, కునేటి శ్రీను, చెదల విజయ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన పీఈటీ సుందర్‌ను డీన్ ధనసుందర్ అభినందించారు.

పేకాడుతూ పట్టుబడ్డ అన్నవరం దేవస్థానం ఉద్యోగులు

ఇద్దరికి షోకాజ్ నోటీసు

అన్నవరం, సెప్టెంబరు 19: కాకినాడ జిల్లా తుని రూరల్ పరిధిలో నాలుగు రోజుల క్రితం పేకాడుతూ పట్టుబడ్డ అన్నవరం దేవస్థానం ఉద్యోగులు ఇద్దరికి ఈవో రామచంద్రమోహన్ గురువారం షోకాజ్ నోటీసులు ఇచ్చారు. దేవస్థానం ఏఈవో కొండలరావు, సూపరింటెండెంట్ బీవీ రామారావు గత ఆదివారం కొందరు వ్యక్తులతో కలిసి పేకాడుతూ దొరికిపోగా రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దేవస్థానం ప్రతిష్ఠ మసకబారేలా వ్యవహరించిన వారిద్దరిపై చర్యలు తీసుకుంటూ ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఈవో కోరారు.

డీఈవో ధ్రువీకరణ లేని దరఖాస్తుల తిరస్కరణ

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 19: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుకు దరఖాస్తు చేసిన వాటిలో జిల్లా విద్యాశాఖాధికారి ధ్రువీకరణ లేని వాటిని తిరస్కరిస్తున్నట్టు కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్ తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇప్పటివరకు 14,191 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఓటుకోసం దరఖాస్తు చేసుకున్న వాటిలో కొన్నింటిపై ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరణ చేశారన్నారు. వాటిని తిరస్కరిస్తున్నామని చెప్పారు.

తిరుపతి-శ్రీకాకుళం రోడ్ మధ్య వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, సెప్టెంబరు 19: రానున్న పండుగ రోజులను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు, వారికి మరింత మెరుగైన ప్రయాణ సదుపాయాలు కల్పించేందుకు తిరుపతి-శ్రీకాకుళం రోడ్-తిరుపతి మధ్య సెప్టెంబరు, నవంబరు నెలల్లో వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుపతి-శ్రీకాకుళం రోడ్ (07442) తిరుపతిలో ప్రతి ఆదివారం సాయంత్రం 5.10 గంటలకు బయల్దేరి రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు మీదుగా అర్ధరాత్రి 2.02 గంటలకు రాజమహేంద్రవరం, అర్ధరాత్రి 2.57 గంటలకు సామర్లకోట, తెల్లవారుజామున నాలుగు గంటలకు తుని... అక్కడి నుంచి అనకాపల్లి, దువ్వాడ, సింహాచలం, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా సోమవారం మధ్యాహ్నం 12.15 గంటలకు చేరుతుంది. ఈ రైలు సెప్టెంబరు 20, 27, నవంబరు 3, 10 తేదీల్లో ప్రతి ఆదివారం బయల్దేరుతుంది.

శ్రీకాకుళం రోడ్-తిరుపతి (07443) ప్రతి సోమవారం సాయంత్రం మూడు గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయల్దేరుతుంది. చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, సింహాచలం, దువ్వాడ, అనకాపల్లి మీదుగా రాత్రి 8.22 గంటలకి తుని, రాత్రి 8.58 గంటలకి సామర్లకోట, 9.45 గంటలకి రాజమహేంద్రవరం ... అక్కడి నుంచి ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట మీదుగా మంగళవారం ఉదయం 8.20 గంటలకి తిరుపతి చేరుతుంది. ఈ రైలు సెప్టెంబరు 21, 28, నవంబరు 4, 11 తేదీల్లో ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్‌లో బయల్దేరుతుంది. సెకండ్ ఏసీ-1, థర్డ్ ఏసీ-2, స్లీపర్-13, జనరల్-6, ఎస్ఎల్ఆర్-2 వెరసి 24 బోగీలతో ఈ రైలు రెండువైపులా రాకపోకలు సాగిస్తుంది. ప్రయాణికులు ఆయా స్టేషన్లలో బుకింగ్ కార్యాలయాల వద్ద రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని రైల్వే ఉన్నతాధికారులు జారీ చేసిన ప్రకటనలో తెలిపారు.

అది అడవి పిల్లి

- శ్రీరాంపురం సమీపంలో ట్రాప్ కెమెరాలో గుర్తించాం
- చిరుత పులిని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు: ఇన్‌చార్జి డీఎఫ్‌వో భరణి



ట్రాప్ కెమెరాలో గుర్తించిన అడవి పిల్లి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 19: తూర్పు గోదావరి జిల్లా దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోని శ్రీరాంపురం గ్రామ సమీపంలో అమర్చిన ట్రాప్ కెమెరాలో బుధవారం రాత్రి అడవిపిల్లిని గుర్తించామని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిరుత పులి, అడవి పిల్లి పాదముద్రల్లో చాలా తేడాలుంటాయని ఆమె వివరించారు. అడవిపిల్లి పాదముద్రలు పరిమాణంలో చిరుత పులి పాదముద్రల కంటే చిన్నవిగా ఉంటాయన్నారు. బుధవారం రాత్రి శ్రీరాంపురం, గురువారం కోలమూరుల్లో చిరుతపులి సంచరిస్తున్నట్టు తమకు సమాచారం అందిందన్నారు. దీంతో నిపుణులు వెళ్లి పాదముద్రలను గమనించి... అవి అడవిపిల్లి పాదముద్రలుగా నిర్ధారించారన్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాప్ కెమెరాల స్థానం మార్చామన్నారు. అదనపు ట్రాప్ కెమెరాలను అమర్చి మొత్తం 100 ట్రాప్ కెమెరాలను ఉపయోగిస్తున్నామన్నారు. చిరుతపులిని పట్టుకునేందుకు ఏడు బోనులు అమర్చి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం నివాస ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్టు నిర్ధారణ కాలేద న్నారు. అటవీ శాఖకు అందరూ సహకరించాలని కోరారు. అసత్య ప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దని విజ్ఞప్తి చేశారు. నకిలీ సందేశాలకు పాల్పడిన వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.



రాజమహేంద్రవరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

పుష్కరాల నాటికి ఈస్ట్ రైల్వే స్టేషన్ అభివృద్ధి

- రూ.280 కోట్లతో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ
- రాజమహేంద్రవరం పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక

ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 19: వచ్చే గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం ఈస్ట్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రూ.280 కోట్లతో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు చేపట్టడానికి కేంద్రానికి డీపీఆర్ పంపినట్టు చెప్పారు. రైల్వే అధికారులు ముందుగా రూ.240 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశారని, భవిష్యత్ అవసరాలు, పార్కింగ్, ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సౌకర్యాల కోసం అదనంగా మరో రూ.40 కోట్లు పెంచి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రధానంగా ఈస్ట్ రైల్వేస్టేషన్ వైపు ఎక్కువగా అభివృద్ధి చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. అలాగే రాజమహేంద్రవరం పట్టణ ముఖచిత్రాన్ని మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉందన్నారు. ట్రాఫిక్ చక్కదిద్దడం, స్వచ్ఛమైన తాగునీరు అందించడం, మురుగునీటి మళ్లింపు, ఇతర అభివృద్ధి పనుల కోసం సమగ్ర సర్వే జరిపి, దానికి అనుగుణంగా కార్యాచరణ చేపట్టనున్నట్టు చెప్పారు. మధురపూడి విమానాశ్రయం నూతన టెర్మినల్ త్వరలోనే ప్రారంభమవుతుంద పురందేశ్వరి చెప్పారు. రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీ, అయోధ్య, జైపూర్‌లకు విమానాలు నడపాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రిని కోరామన్నారు. వరద బాధితులను మంచి ప్యాకేజీతో రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుందని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ తూర్పు గోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, నాయకులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బియ్యంతో విజిలెన్స్ అధికారులు

9,718 కిలోల

రేషన్ బియ్యం పట్టివేత

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వాహన తనిఖీల్లో భాగంగా విజిలెన్స్, పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులతో కూడిన బృందం గురువారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రధాన తపాలా కార్యాలయం సమీపంలో ఓ వ్యాన్‌ను పరిశీలించింది. 198 బస్తాల్లో సుమారు 9,718 కిలోల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. గొల్లప్రోలుకు చెందిన వాహన యజమాని పడాల నాగ సూర్యనారాయణ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అనపర్తి ప్రాంతంలోని కోళ్ల ఫారాలకు తీసుకెళ్లమన్నట్టు అదే ఊరికి చెందిన వాహన డ్రైవరు ఊట దుర్గాప్రసాద్ చెప్పాడు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.26 లక్షలు ఉంటుంది. వ్యాన్ యజమాని, డ్రైవర్‌లపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, నవీన్‌కుమార్, వలీ, వీరబాబు, సీఎస్‌డీటీ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతర నిఘా కొనసాగుతోందని.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ ఎస్పీ హెచ్చరించారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాపై సమాచారం ఉంటే 8008203261 నెంబరుకి సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

పాఠశాలల్లో నాడు-నేడు పనుల పూర్తికి రూ.1,400 కోట్లు అవసరం

- పనుల నిర్వహణలో లోపాలు ఉన్నాయి
- సెంట్రల్ మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్‌కు రూ.97కోట్లు బిల్లుల పెండింగ్
- విద్యా శాఖ అకడమిక్ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు





ఎ.విజయనగరంలో నాడు-నేడు పనులపై ఆరా తీస్తున్న నాగేశ్వరరావు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 19: రాష్ట్రంలోని పాఠశాలల్లో నాడు-నేడు పనుల పూర్తికి మరో రూ.1,400 కోట్లు అవసరమవుతాయని విద్యా శాఖ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అకడమిక్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు వెల్లడించారు. గత ప్రభుత్వం సెంట్రల్ మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్‌కు రూ.97కోట్లు బిల్లులను పెండింగులో ఉంచిందని చెప్పారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఎ.విజయనగరం, చేబ్రోలు రథంబాట మండల పరిషత్ పాఠశాల, దుర్గాడ, చేబ్రోలు, గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలు, ఎంపీఆర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కొడవలి పాఠశాలల్లో పనులను ఆయన గురువారం తనిఖీ చేశారు. మండలంలోని ఎ.విజయనగరంతో పాటు ఐదు పాఠశాలల్లో పనుల నిర్వహణపై ఫిర్యాదులు అందాయని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 'నాడు-నేడు' కింద జరిగిన పనుల్లో 44 పాఠశాలల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లోపాలు గుర్తించామని చెప్పారు. పాఠశాలల తరగతి గదులకు అవసరమైన కిటికీలు, తలుపులు తదితర పనులను అప్పటి నిర్వాహకులు పూర్తి చేయలేదని తనిఖీల్లో వెల్లడైందన్నారు. డిసెంబరు నాటికి అన్ని పనులు పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. పాఠశాలల్లో 'నాడు-నేడు' కింద మిగిలిన పనులను పూర్తి చేసేందుకు కొత్త విద్యా కమిటీలతో బ్యాంకు ఖాతాలు లింక్ చేయాలని ఆదేశించామన్నారు. 20-30 రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. పర్యటనలో గొల్లప్రోలు ఎంఈవో-2 శివప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గౌతు వెంకటరమణ పాల్గొన్నారు.

'అభయ హస్తం' లబ్ధిదారులకు రిక్తహస్తం

పింఛన్లపై అధికారుల తీరుకు టీడీపీ నేత నిరసన ... వెలుగు కార్యాలయానికి తాళం



వెలుగు కార్యాలయానికి తాళం వేస్తున్న మాజీ సర్పంచ్ వెంకట రామారెడ్డి

అనపర్తి, సెప్టెంబరు 19: వృద్ధులకు న్యాయం చేయలేని కార్యాలయాలు ఎందుకు ఉన్నట్టు? ప్రభుత్వం జీతాలు ఎందుకిస్తోందంటూ టీడీపీ తూర్పు గోదావరి జిల్లా అధికార ప్రతినిధి, కొప్పవరం మాజీ సర్పంచ్ కర్రి వెంకట రామారెడ్డి అనపర్తిలోని వెలుగు కార్యాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన కార్యాలయానికి తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరామారెడ్డి మీడియాతో మాట్లాడుతూ 2009లో అప్పటి ప్రభుత్వం డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న మహిళలతో సొమ్ములు కట్టించుకుని వారికి 60 ఏళ్లు పూర్తయిన తర్వాత 'అభయహస్తం' పేరుతో నెలకు రూ.500 పింఛను ఇవ్వాలని పథకం రూపొందించిందన్నారు. గత ప్రభుత్వం అభయహస్తం పింఛన్లపై దృష్టి సారించకపోవడంతో అనేక మంది అర్హులు పింఛను అందుకోలేకపోయారన్నారు. అప్పట్లో వీరంతా వెలుగు కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. జిల్లావ్యాప్తంగా సొమ్ము చెల్లించి పింఛన్లు అందక అనేక మంది వృద్ధులు ఇబ్బందిపడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొప్పవరం గ్రామంలో అర్హులైన ఐదుగురిని గుర్తించి పింఛను పునరుద్ధరించాలని కోరానన్నారు. నెల క్రితం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నిర్వహించిన వెలుగు అధికారుల సమావేశంలో కూడా నియోజకవర్గంలో వెలుగు పథకం ద్వారా అర్హులై పింఛను రాని వారి జాబితాను రూపొందించాలని కోరినప్పటికీ నేటికీ పట్టించుకోలేదన్నారు. పింఛను మంజూరు చేయకపోతే వారు ఏడాదికి రూ.385 చొప్పున చెల్లించిన సొమ్ములైనా వెనుకకు ఇప్పించాలని కోరినప్పటికీ అదీ జరగలేదన్నారు. ఈ విషయమై అధికారులను ఎన్నిసార్లు ప్రశ్నించినా పొంతన లేని సమాధానాలు చెప్తున్నారన్నారు. గురువారం దీనిపై ప్రశ్నించేందుకు వెలుగు కార్యాలయానికి వెళ్లగా... ఏపీఎం సెలవులో ఉన్నారని తమకేమీ తెలియదని సిబ్బంది చెప్పారన్నారు. అందుకే కోపంతో కార్యాలయానికి తాళాలు వేశానని చెప్పారు.



కంటైనర్‌లో తరలిస్తున్న ఎద్దులు

53 ఎద్దులు ఒక కంటైనర్‌లో...

అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న కొవ్వూరు పోలీసులు

కొవ్వూరు, సెప్టెంబరు 19: సరైన ఆహారం, నీరు అందించకుండా అక్రమంగా తరలిస్తున్న పశువుల కంటైనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... పాయకరావుపేట సంత నుంచి 53 ఎద్దులను తమిళనాడుకు చెందిన కంటైనర్‌లో హనుమాన్ జంక్షన్ తరలిస్తుండగా కొవ్వూరు గామన్ బ్రిడ్జి వద్ద విశ్వహిందూపరిషత్ సభ్యులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం, పట్టణ ఎస్ఐ కె.జగన్మోహన్ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని కంటైనర్‌తో పాటు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పశువులను గోకవరం గోశాలకు తరలిస్తున్నట్టు సీఐ విశ్వ చెప్పారు.

ఆంధ్రావాసి అమెరికాలో మృతి



రమేష్ (పాత చిత్రం)

నల్లజర్ల, సెప్టెంబరు 19: తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన ముత్తిన రమేష్ (40) అమెరికాలో మృతి చెందాడు. అతని సోదరుడు నరేష్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... రమేష్ అమెరికాలోని ఇల్‌నాయిస్ రాష్ట్రం కార్బోనలే సిటీలోని సదరన్ ఇల్‌నాయిస్ యూనివర్సిటీలో ఎంఎస్ చదవడానికి 2022లో వెళ్లాడు. ప్రైవేటుగా ఉద్యోగం చేస్తూనే చదువుకుంటున్నాడు. అక్కడి యువతితో రెండేళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెతో విభేదించి రమేష్ వేరుగా ఉంటున్నాడు. ఆదివారం రాత్రి బయటకు వెళ్లి భోజనం చేసి వచ్చి రూమ్‌లో పడుకున్నాడని అతని స్నేహితులు చెప్పారు. సోమ, మంగళవారాల్లో రమేష్ ఆచూకీ లేకపోవడం, అతడి గది నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా రమేష్ మృతి చెంది ఉన్నాడని, మృతదేహం పాడై ఉందని వివరించారు. అక్కడి పోలీసులే బుధవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గుండెపోటు లేదా బ్రెయిన్ హెమరేజ్‌తో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని ఇండియా తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మృతుడికి తల్లి పండమ్మ, సోదరులు నాని, నరేష్ ఉన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



నిడదవోలు, సెప్టెంబరు 19: తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు రైల్వే స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటుచేస్తున్న 5వ నెంబరు ప్లాట్‌ఫామ్ సమీపంలో గురువారం సాయంత్రం సుమారు 60 సంవత్సరాల గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్టు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు తెలిపారు. సదరు వ్యక్తి అనారోగ్య పరిస్థితుల వల్ల కానీ, ఇతర కారణాల వల్ల కానీ సహజ మరణం సంభవించి ఉంటుందని ఆయన తెలిపారు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు కాటన్ లుంగీ, కాషాయ రంగు టవల్, మెడలో చిన్న రుద్రాక్షమాల, జంధ్యం ఉన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. మృతుని గుర్తించిన వారు 7013360296, 9948010061 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

డెంగీతో చిన్నారి మృతి



శంఖవరం, సెప్టెంబరు 19: కాకినాడ జిల్లా శంఖవరం గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి ఎమ్మిలి వనజ వారం నుంచీ తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. నాలుగు రోజుల క్రితం రౌతులపూడి సీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో గురువారం సాయంత్రం బాలిక మృతి చెందిందని వైద్యులు చెప్పారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

30.680 కిలోలు స్వాధీనం

గోకవరం, సెప్టెంబరు 19: గంజాయి కలిగి వున్న ఇద్దరు మైనర్ల (మహిళలు)ను గురువారం అరెస్టు చేసినట్టు గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తూర్పు గోదావరి జిల్లా గోకవరం ఆర్టీసీ డిపో సమీపంలోని బమ్మెర పోతన విగ్రహం వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా రెండు సంచుల్లో రూ.1,53,400 విలువైన 30.680 కిలోల గంజాయిని గుర్తించారు. ఒక సెల్‌ఫోన్, రూ.1,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. మైనర్లను ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరికి చెందిన వారిగా గుర్తించి జువనైల్ హోమ్‌కి తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

మాజీ ఎంపీటీసీకి ఎమ్మెల్యే రాజప్ప పరామర్శ

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 19: సతీ వియోగంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీఎంపీటీసీ పోలిశెట్టి భాస్కరరావును గురువారం పెద్దాపురంఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించారు. భాస్కరరావు కుమారుడు శివ, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, నాయకులు చిల్లా పురుషోత్తం, రవణం మధు, మద్దింశెట్టి సీతారామస్వామి, సలాది శ్రీనివాసరావు, చిక్కం కాసు, గాలిదేవర సురేష్ పాల్గొన్నారు.

- అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్
- కలెక్టర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటాం
- రాష్ట్ర వ్యాప్తంగా 170 అన్నక్యాంటీన్ల ఏర్పాటు

ఎన్జీటీ తీర్పు అమలు చేయాలని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాలు

అంతర్వేది, సెప్టెంబరు 19: అంతర్వేది దేవస్థానం గ్రామం పదహారు స్తంభాల మండపం వద్ద ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) ఇచ్చిన తీర్పును తక్షణమే అమలు చేయాలంటూ ప్రజాసంఘాల నాయకులు గురువారం నిరసన చేపట్టారు. అంతర్వేది దేవస్థానం నుంచి కేశవదాసుపాలెం వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. అంతర్వేది దేవస్థానం సర్పంచ్ కొండా జాన్‌బాబు మాట్లాడుతూ ఎన్జీటీ తీర్పును గ్రామంలో ప్రతీ ఒక్కరూ గౌరవిస్తూ కట్టుబడి ఉండాలన్నారు. అధికారులు అలసత్వం వహిస్తే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. మానవహక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఆర్‌జడ్ పరిధిలో ఉన్న ఆక్వా చెరువులను తక్షణమే తొలగించాలని, 200మీటర్ల నుంచి 2వేల మీటర్ల వరకు కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ చట్ట ప్రకారం అనుమతిలేని చెరువులను తొలగించాలని డిమాండు చేశారు. సీపీఐ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆక్వా సాగు వల్ల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయన్నారు. దీంతో కొబ్బరి, తాడిచెట్లు నాశనమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో సమైక్య యూత్ అధ్యక్షుడు చొప్పల మధు, బుంగ వరప్రసాద్, చింతా కిరణ్, మోకా చిరంజీవి, చవ్వాకుల వెంకట్, నల్లి ప్రసాద్, సరెళ్ల విజయ్‌ప్రసాద్, తోటే ప్రతాప్, ఆకుమర్తి భూషణంపాల్గొన్నారు.

వైసీపీ రద్దు చేసిన సర్క్యులర్‌ను పునరుద్ధరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దామోదరరావు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 19: ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన 1/2019 సర్క్యులర్‌ను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని, ఆ సర్క్యులర్‌ను మళ్లీ పునరుద్ధరించాలని ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు కోరారు. గురువారం రామచంద్రపురంలో చెలికాని రామారావు స్మారక మందిరంలో జరిగిన ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022 నుంచి నిలిచిపోయిన నైట్‌హాల్టు అలవెన్సులు చెల్లింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటి నుంచి పదోన్నతులు నిలిచిపోయాయని, ప్రభుత్వం వెంటనే పదోన్నతులకు అనుమతులు ఇవ్వాలన్నారు. విజయవాడ జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు ఇహెచ్‌ఎస్ ద్వారా వైద్య సేవలు అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అమలుచేసిన రిఫరల్ ఆసుపత్రుల ద్వారా వైద్య సేవలు అందజేయాలని కోరారు. పలు యూనియన్లకు చెందిన 21మంది ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరారు. కార్యక్రమంలో ఈయూ కోనసీమ జిల్లా అధ్యక్షుడు రావుల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి గిడ్ల చిరంజీవి, రీజనల్ బాధ్యులు పి.సత్తిబాబు, సిసియస్ డెలిగేట్ టి.గన్నియ్య, డిపో అధ్యక్షుడు డి.ఎం.రావు, కార్యదర్శి లక్ష్మీనారాయణ, జాయింటు సెక్రటరీ డీఎస్ఆర్ కృష్ణ, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జి.అగ్రహారం విద్యార్థులు


అంబాజీపేట: రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అంబాజీపేట, సెప్టెంబరు19: రామచంద్రపురం జూనియర్ కాలేజీలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ -19 టేబుల్ టెన్నిస్ పోటీల్లో గంగలకుర్రు అగ్రహారం హైస్కూల్ విద్యార్థులు మట్టపర్తి గీష్మశ్రీ, ఇళ్ల మనోజ్ఞనాగదీప్తి, దంగేటి విద్యాసాయిశ్రీ, కొల్లు సత్యశ్రీవాణి, బొక్కా హేమలక్ష్మీదుర్గ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం విజయవాడలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని హెచ్‌ఎం జి.రాజశేఖర్ తెలిపారు.ఈనెల18న కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్లో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-14,17విభాగాల్లో చొల్లంగి జాహ్నవి శివదుర్గ, వంటపాటి భరతి, కుప్పాల ప్రణయ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు త్వరలో విజయవాడలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ తొత్తరమూడి గోవిందు, సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, ఉపసర్పంచ్ బందన రాంబాబు, నాయకులు ఎం.ఎం.శెట్టి, విత్తనాల శేఖర్, రాయుడు షణ్ముఖ్, టీచర్లు అభినందించారు.

అండర్-19 క్రీడాకారుల ఎంపికకు పోటీలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 19: అండర్-19 క్రీడాకారుల ఎంపిక పోటీలు గురువారం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో జరిగాయి. స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాస్కెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, బేస్బాల్, షటిల్, కరాటే, టేబుల్ టెన్నిస్ ఆరు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జూనియర్ కళాశాలల నుంచి వచ్చిన 200మంది క్రీడాకారుల నుంచి 16 జట్లను ఎంపిక చేసినట్లు పీడీ జంపని రఘురామ్ తెలిపారు. ప్రిన్సిపాల్ వీరన్న, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, ఎస్‌జీఎస్ అండర్-19 సెక్రటరీ శివరామకృష్ణ, పీడీలు కె.సతీష్ ఈవీవీ సత్యనారాయణ, రతన్ శ్యామ్యూల్ పాల్గొన్నారు.

మండల స్థాయి బాలికల క్రీడా పోటీలు

కె.గంగవరం, సెప్టెంబరు 19: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పామర్రు ఉన్నత పాఠశాల ఆట స్థలంలో గురువారం మండల స్థాయి 14-17ఏళ్ల బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, లాంగ్ జంప్, చదరంగం, షటిల్ బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు జరిగాయి. విజేతలకు మెడల్స్ అందజేశారు. విజేతలను నియోజవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీలు ఏఎస్‌వీ సత్యనారాయణ, పి.సురేష్‌బాబు చెప్పారు.

రాష్ట్ర స్థాయి సపక్‌తక్రా పోటీలకు ఎంపిక


వర్షిణి, స్వీటీ, నవ్య

అమలాపురం రూరల్, సెప్టెంబరు 19: ఇందుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు టీవీవీ వర్షిణి, యాలంగి స్వీటీ, పెదపూడి నవ్య (9వ తరగతి) రాష్ట్రస్థాయి సపక్‌తక్రా పోటీలకు ఎంపికైనట్టు పీఈటీ వి.శ్రీనరసింహారావు గురువారం తెలిపారు. కాకినాడలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారు అక్టోబరులో ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణిలను హెచ్‌ఎం విత్తనాల శ్రీనివాసరావు, విద్యాకమిటీ చైర్‌పర్సన్ పి.మంగతాయారు, వైస్‌చైర్మన్ రాజారమేష్, సర్పంచ్ చొల్లంగి శివాళిని తదితరులు అభినందించారు.

రైల్వేలైన్ ఎలైన్‌మెంట్‌లో ఎవరికి అన్యాయం జరగదు


మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ గంటి హరీష్‌మాధుర్

ముమ్మిడివరం, సెప్టెంబరు 19: కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ ఎలైన్‌మెంట్ ఏర్పాటులో ఎవరికి ఏవిధమైన నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. ముమ్మిడివరంలో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయన గురువారం రాత్రి స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2002లో అప్పటి ప్రభుత్వం రూపొందించిన రైల్వేలైన్ ఎలైన్‌మెంట్‌ను వైసీపీ ప్రభుత్వం మార్పు చేసిందన్నారు. మార్చిన కొత్త ఎలైన్‌మెంట్‌పై స్థానికులతో చర్చించలేదని, వారి సమస్యలు పరిష్కరించకుండా ఎలైన్‌మెంట్‌ను మార్పు చేశారన్నారు. ప్రజల ఇబ్బందులపై వినతులు స్వీకరించామని, దీనిపై కలెక్టర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కొత్త ఎలైన్‌మెంట్‌తో చాలా ఇబ్బందులు వస్తాయని, దానిపై చర్చించి న్యాయం చేస్తామని, ఎవరికి అన్యాయం జరగకుండా రైల్వేలైన్ ఏర్పాటు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లోనే ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను 50శాతం పూర్తిచేశామన్నారు. సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన రోజే అన్నక్యాంటీన్ ఫైల్‌పై సంతకం చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 170 అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. మెగా డీఎస్సీ అమలు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని, పింఛన్‌ను రూ.4వేలకు పెంచామన్నారు. ఏడాదిలోపు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత గ్యాస్ కూడా అందిస్తామన్నారు. ఈసమావేశంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, జిల్లా పార్టీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, స్థానిక నాయకులు ఉన్నారు.

సంక్షోభంలో సంక్షేమం కూటమికే సాధ్యం

కొత్తపేట, సెప్టెంబరు 19: సంక్షోభ పరిస్థితుల్లో కూడా సంక్షేమాన్ని అందించిన చంద్రన్న కూటమి పాలన భేష్ అని టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో 100 రోజుల చంద్రన్న పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాల గురించి వివరించారు. ఇందులో భాగంగా నిరుద్యోగులకు మెగా డీఎస్సీ, నెలలో మొదటి రోజే పింఛన్ల పెంపు, ఉద్యోగులకు జీతాలు, రైతులు ధాన్యం బకాయిలు చెల్లింపు, అన్నా క్యాంటీన్లు వంటి కార్యక్రమాలతో పాటు వరద ముంపు ప్రాంతాల్లో నిద్రహారాలుమాని ప్రజల యోగాక్షేమాల కోసం నిత్యం పనిచేసే వ్యక్తి చంద్రబాబు అన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, బూసి భాస్కరరావు, కాసా విద్యాసాగర్, పల్లి ఏసు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సాహితీ సూర్యుడు బోయి భీమన్న

అమలాపురం టౌన్, సెప్టెంబరు 19: ఆధునిక తెలుగు సాహిత్యాన్ని తేజోవంతం చేసిన సాహితీ సూర్యుడు పద్మశ్రీ బోయి భీమన్న అని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ పేర్కొన్నారు. స్థానిక డాబా గార్డెన్స్‌లో కళావేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం బోయి భీమన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రతాప్ మహాకవి బోయి భీమన్న వ్యక్తిత్వం-రచనలు అనే అంశంపై ప్రసంగించారు. జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లాశాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కదలి సత్యనారాయణ, పసలపూడి సతీష్ తదితరులు మాట్లాడారు. భీమన్న రచనలు వివరించారు.

మామిడికుదురు: సాహితీ లోకానికి మహాకవి, పద్మభూషణ్ బోయి భీమన్న చేసిన సేవలు అమూల్యమైనవని పలువురు వక్తలు కొనియాడారు. బోయి భీమన్న జయంతిని మామిడికుదురులోని బోయి భీమన్న మానవ వనరుల కేంద్రం వద్ద గురువారం ఘనంగా జరిపారు. ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కవితా పఠనం చేసి కవి సమ్మేళనం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో చెరుకూరి సూర్యనారాయణ, యేడిద కవీంద్ర, గాదరాడ రవిచంద్ర, కందాల వెంకటేశ్వరరావు, భావరాజు సూర్యప్రకాశరావు, మాగాపు దుర్గారావు, గెయిల్ శిక్షణా సంస్థ ప్రతినిధులు అధికారపు సురేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట ముహూర్తం

యానాం, సెప్టెంబరు19: శ్రీదేవిశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా యానాం శివారు దరియాలతిప్ప-గిరియాంపేట రోడ్డులో ఉన్న పాలకనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద గురువారం ఉదయం పందిర రాట ముహూర్తం నిర్వహించారు. తొలుత ఆలయంలో అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అక్టోబరు 3నుంచి అక్టోబరు 12వరకు శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తామన్నారు.

ఆలయాల వద్ద మద్యం షాపులొద్దు

రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు19: రామచంద్రపురంలో మార్కెట్ వీధిలో రామాలయం నుంచి అన్నపూర్ణ థియేటర్ వద్ద వేణుగోపాలస్వామి ఆలయం వరకు మధ్యలో మద్యం షాపులు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వవద్దని కూటమి నాయకులు గురువారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. జనసేన పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ, సత్యవాడ శ్రీహరి పంతులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలు శుభ్రం

అంతర్వేది, సెప్టెంబరు 19: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ పరిసరాలను ఆలయ అధికారులు, సిబ్బంది శుభ్రపరిచారు. అన్నదాన విభాగం, తూర్పు గోపురం, గోడలు, ఆలయ పరిసరాలు ఉన్న గడ్డి మొక్కలు, చెట్ల కొమ్మలు తొలగించి శుభ్రం చేసినట్టు సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

నైపుణ్యాలను పెంపొందించుకునేందుకే స్మార్క్


కిమ్స్ వైద్య కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేసి స్మార్క్ సమావేశాలను ప్రారంభిస్తున్న డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య

అమలాపురంరూరల్, సెప్టెంబరు19: ఆధునిక వైద్య రంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకుంటూ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన బాధ్యత ప్రతీ వైద్య విద్యార్థికి ఉందని కళాశాల పూర్వ డీన్ డాక్టర్ ఏఏస్ కామేశ్వరరావు, డాక్టర్ ఎంబీఆర్ శర్మ అన్నారు. అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో మూడు రోజుల పాటు జరిగే దక్షిణ భారత వైద్య విద్యార్థుల వార్షిక ప్రయోగాత్మక అవగాహన సమ్మేళనం (స్మార్క్) సమావేశాలను గురువారం కళాశాల డీన్ డాక్టర్ ఆనంద్ ఆచార్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసమావేశాల ద్వారా వైద్య విద్యార్థులు పరిశోధనా పత్రాలు సమర్పించడంతో పాటు పోస్టర్ ప్రజెంటేషన్ల ద్వారా తమ నూతన ఆవిష్కరణలను వివరించవచ్చునన్నారు. వివిధ కళాశాలల నుంచి వెయ్యి మందికి పైగా వైద్య విద్యార్థులు వర్క్‌షాపులో పాల్గొన్నారు. నిర్వాహకులను కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఎండీ రవికిరణ్‌వర్మ అభినందించారు. ఈ సమావేశాలకు డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ ప్రవీణ్ మాస్కను పరిశీలకునిగా నియమించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన సమాజం


నల్లమిల్లిలో ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జేడీ బోసుబాబు తదితరులు

అమలాపురంరూరల్, సెప్టెంబరు18: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ వి.బోసుబాబు పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పెట్టుబడులను తగ్గించుకోవచ్చునన్నారు. నల్లమిల్లిలో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతు వాకపల్లి శ్రీనివాస్ పొలంలో ఎండుతెగులు ఉధృతిని జేడీ గుర్తించారు. రైతులు నత్రజని ఎరువుల వినియోగాన్ని తగ్గించుకుని అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటిస్తున్న శ్రీనివాస్ పంట పొలాన్ని అధికారుల బృందం పరిశీలించింది. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించే అప్పారి చిన వెంకటరమణ, ఎ-గ్రేడ్ మోడల్, ఏటీఎం మోడల్స్‌ను అధికారులు పరిశీలించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు ఎంఏ జోషి, ప్రకృతి వ్యవసాయ అధికారి కె.శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి కదలి ధర్మప్రసాద్, ఏఈవో డి.ప్రేమ్‌కుమార్, సూరిబాబు, సందీప్, నీవన్, వెంకటరమణ, కృష్ణప్రశాంతి, దుర్గాభవానీ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

'ఏఎఫ్‌డీటీ'లో అవకతవకలు జరగలేదు

మలికిపురం, సెప్టెంబరు 19: ఏఎఫ్‌డీటీ విద్యా సంస్థలో ఎటువంటి అవకతవకలు జరగలేదని కరస్పాండెంట్ ఎంవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాపకులు జీతాలు చెల్లించాలంటూ ఎనిమిది రోజులుగా సమ్మె చేస్తున్న సంగతి విదితమే. కళాశాల కరస్పాండెంట్ అవకతవకలకు పాల్పడినట్టు సమ్మె చేస్తున్న సిబ్బంది, వారికి సంఘీభావం పలుకుతున్న నాయకులు ప్రచారం చేయడంతో వివరణ ఇస్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తాము సక్రమంగానే నిర్వహిస్తున్నామని, ఆడిట్‌లు జరుగుతున్నాయని, ఎటువంటి తప్పులు జరగలేదన్నారు. సంస్థకు రూ.80లక్షల నుంచి రూ.98లక్షల వరకు ఆదాయం వస్తుండగా రూ.1.60కోట్లు ఖర్చు అవుతుందన్నారు. తమ కళాశాలలో ప్రస్తుతం ఉన్న సిబ్బందికి తగిన పని లేదన్నారు. సమావేశంలో జాన శంకరరావు, డాక్టర్ పద్మరాజు, పాల్గొన్నారు.

తాడికోనలో కోడి పందాలు

అల్లవరం, సెప్టెంబరు 19: తాడికోనలో కోడిపందాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు అల్లవరం పోలీసులు దాడి చేశారు. పోలీసుల రాకను గమనించి పందెం రాయుళ్లు పరారయ్యారు.

బాణసంచా అనధికార తయారీ కేంద్రాలపై దాడులు

అమలాపురంటౌన్, సెప్టెంబరు19: అమలాపురం పట్టణ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా బాణసంచా తయారీ, నిల్వల కేంద్రాలపై పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. పేరూరుశివారు తోట్లపాలెం, అమలాపురం మార్కెట్ సెంటర్‌లో అక్రమంగా నిల్వచేసిన, తయారు చేసిన బాణసంచా సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నట్టు తెలిపారు.

కార్మిక యోధుడు ఏచూరి

ఉప్పలగుప్తం, సెప్టెంబరు19: కార్మిక యోధుడు ఏచూరి సీతారాం మృతి కార్మిక లోకానికి తీరని లోటని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. గొల్లవిల్లిలో సీఐటీయూ నాయకురాలు బేబీగంగారత్నం అధ్యక్షతన ఏచూరి సంస్మరణ సభ జరిగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, కె.పరిపూర్ణ, ఎస్.సుబ్బలక్ష్మి, యు.అంజలరావు, ఆకుల సూరిబాబు పాల్గొన్నారు.

దారి చూపారు..



అమలాపురం టౌన్, సెప్టెంబరు 19: ఆంధ్రజ్యోతిలో స్వచ్ఛత నహీ శీర్షికన ప్రచురితమైన వార్తా కథనానికి కాస్త చలనం వచ్చింది. నల్లవంతెన దిగువన ప్రధాన శ్మశానవాటికకు వెళ్లే సిమెంటు రోడ్డును సైతం మూసేసి దారి పొడవునా పురపాలక సంఘం చెత్తతో నింపేశారు. గురువారం ఉదయం సైతం మరింత చెత్త పెరిగిపోయి బైపాస్ రోడ్డును సైతం మూసేసింది. మధ్యాహ్నానికి ప్రొక్లెయినర్ సాయంతో అదేచెత్తను సీసీ రోడ్డుకు ఒకవైపుకు పూర్తిగా తరలించి కొంత దారిమార్గాన్ని చూపించారు. కానీ ఎక్కడ చెత్త అక్కడే ఉండిపోయి కుళ్లి కంపు కొడుతోంది. కేవలం శ్మశానవాటికకు వెళ్లేందుకు మాత్రం దారిని చూపించారు.

ఓడలరేవు రిసార్ట్స్ వద్ద దాడి కేసుపై డీఎస్పీ విచారణ

అల్లవరం, సెప్టెంబరు 19: ఓడలరేవు సముద్ర బీచ్ రిసార్ట్స్ వద్ద వంట కుక్ మట్టా దుర్గాప్రసాద్‌పై ముగ్గురు యువకులు దాడికి పాల్పడిన సంఘటనపై అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ గురువారం విచారణ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఓడలరేవు బీచ్ రిసార్ట్స్‌లో వంట కుక్‌గా పనిచేస్తున్న కొమరగిరిపట్నానికి చెందిన మట్టా దుర్గాప్రసాద్‌పై బుధవారం రాత్రి కొమరగిరిపట్నానికి చెందిన సుంకర సురేష్, తిక్కిరెడ్డి బన్ని, తీరం రమేష్‌లు మద్యం ఖాళీ సీసాతో తలపై కొట్టి గాయపరిచారన్నారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, హత్యాయత్నం కేసు నమోదు కాగా డీఎస్పీ విచారణ చేపట్టారు. బాధితుడు అమలాపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అమలాపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. ఎస్ఐ జి.హరీష్‌కుమార్, వీఆర్వో మెట్ల ఆదినారాయణ ఆయన వెంట ఉన్నారు.

ఉమ్రా యాత్రకు ముస్లిం భక్త బృందం

మామిడికుదురు, సెప్టెంబరు 19: ఉమ్రా యాత్రకు నగరం నుంచి 20 మంది ముస్లింలు గురువారం బయలుదేరి వెళ్లారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ వీరికి అల్పాహార కిట్లు అందించి వీడ్కోలు పలికారు. వారు 12రోజుల యాత్రలో మక్కా, మదీనా దేశాల్లోని పలు పుణ్యక్షేత్రాలను సందర్శిస్తారు. తొలుత వారు నగరంలోని పెదపంజీషలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, జాలెం సుబ్బారావు, జాలెం శ్రీనివాసరాజా, శిరిగినీడి వెంకటేశ్వరరావు, ముకరం హుస్సేన్, అబేద్‌అలీ, పర్హత్ అలీబేగ్ తదితరులు వీరికి వీడ్కోలు పలికారు.

నిరుద్యోగ వేదపండితులకు రూ.3వేలు భృతి

ఐ.పోలవరం, సెప్టెంబరు 19: వేద విద్యలో ఉత్తీర్ణులై నిరుద్యోగులుగా ఉన్న పండితులకు నెలకు రూ.3,000 భృతి కల్పించనున్నట్టు దేవదాయశాఖ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. వేద విద్యలో క్షమాంతం, గణం, ఆపై కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు వేద విద్య సర్టిఫికెట్, ఆధార్ కార్డు, బ్యాంకు అక్కౌంట్, నిరుద్యోగ ధ్రువీకరణపత్రం జత చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పి.గన్నవరం, సెప్టెంబరు 19: పి.గన్నవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి 11కేవీ నాగుల్లంక ఫీడర్‌లో మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం 7నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. లంకలగన్నవరం, మొండెపులంక, నాగుల్లంక, వాడ్రేవుపల్లి, మానేపల్లి, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని పుచ్చల్లంక, రాయిలంక, కనకాయలంక గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

వరద బాధితులకు రూ.40వేలు టీడీపీ సాయం

కొత్తపేట, సెప్టెంబరు19: విజయవాడ వరద బాధితుల కోసం ఆలమూరు మండలం మూలస్థానానికి చెందిన టీడీపీ నాయకులు దొంగ భాస్కరరావు, లాలం శ్రీనివాస్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.40వేలు నగదును ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు అందించారు.ఈసందర్భంగా సత్యానందరావు వారిని అభినందించారు. ఆ నగదును సహాయ నిధి ఖాతాకు జమ చేశారు.

చీడ, పీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పి.గన్నవరం, సెప్టెంబరు 19: వరిలో ఆశించే చీడ పీడల నివారణకు ప్రతి రైతు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని డాట్ శాస్త్రవేత్త సూచించారు. ఉడిమూడిలో ఎస్సీ రైతులకు ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగహన సదస్సులో ఆయన మాట్లాడారు. యూరియా వాడకం తగ్గించాలని, ఎక్కువగా ఉపయోగిస్తే పంట కాలం పది రోజులు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్, ఏవో జె.మనోహర్, ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఏవో ఎ.కళ్యాణ్‌సూర్యకుమార్, గ్రామసర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, ఎంపీటీసీ ఆదిమూలం సూరయ్యకాపు, రైతులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

అల్లవరం,సెప్టెంబరు 19: అల్లవరం మండలం బసవా వారి కల్యాణ మండపం వద్ద ఈనెల17న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న చిర్రా నాగేశ్వరరావు(60) బుధవారం కాకినాడ ఆసుపత్రిలో మృతిచెందాడు. అల్లవరం ఎస్ఐ హరీష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్
శ్రీలలిత	: ఉత్సాహం
శేఖర్ స్ర్కీన్-1	: కళింగ
శేఖర్ స్ర్కీన్-2	: ఆయ్
రమా	: మత్తువదలరా-2
గణపతి	: కమిటీ కుర్రోళ్లు
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: సరిపోదా శనివారం
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: గొర్రె పురాణం

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ముమ్మిడివరం, సెప్టెంబరు 19: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని కొండాలమ్మ చింతా, బాలయోగి తపోఆశ్రమం ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆధునికీకరణ పనులను టీడీపీ నాయకులు గురువారం పరిశీలించారు. కిలోమీటరు మేర రోడ్డు అధ్వానంగా మారడంతో రూ.1.20కోట్లతో 18అడుగుల వెడల్పున సిమెంటు రోడ్డుగా ఆధునికీకరిస్తున్నారు. నిర్మాణ విషయంలో పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టరుకు సూచించారు. కార్యక్రమంలో దాట్ల బుచ్చిరాజు, వేగిరౌతు రాజబాబు, ములపర్తి బాలకృష్ణ, చిక్కాల అంజిబాబు, జనిపల్లి సత్యనారాయణ, విళ్ల వీరాస్వామినాయుడు, రెడ్డి బాలకృష్ణ, కట్టా సత్తిబాబు, దున్నాల నాగమణి, సానబోయిన సోమయ్య, కడలి శ్రీనివాసరావు, గోరింట్ల శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

కార్మికుల నమోదుకు అవకాశం

రాయవరం, సెప్టెంబరు 19: బిల్డింగ్, ఇతర కనస్ట్రక్షన్ బోర్డుకు సంబంధించి భవన నిర్మాణ కార్మికులుగా నమోదు చేసుకునేందుకు, గతంలో నమోదైన కార్మికులు రెన్యువల్స్ కోసం రాయవరం కార్మికశాఖ కార్యాలయంలో సంప్రదించాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జి.కేశవరావు కోరారు. గురువారం రాయవరంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులుగా నమోదుకు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు, బ్యాంక్‌అకౌంట్ జిరాక్స్, నామినీ వివరాలతో అక్టోబరు10లోపు కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రూ.110 చలానా చెల్లించాలన్నారు. రాయవరంలో గలషాపులు, సంస్థలు లైసెన్స్‌లు రెన్యువల్స్ చేయించాలని, కార్మికులకు వెల్ఫేర్ ఫండ్ చెల్లించాలన్నారు.

విజయవాడ వరద బాధితులకు రూ.6.50లక్షల అందజేత


రూ.6.5లక్షలు విరాళం అందజేస్తున్న దృశ్యం.

మండపేట, సెప్టెంబరు19: విజయవాడ వరద బాధితుల కోసం రాష్ట్ర నెయిలకుల మత్స్యకారుల సంఘం తరపున ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి బుధవారం రాత్రి నెయిలకుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కాటా గోపి, సంఘ నాయకులు రూ.6.5లక్షల విరాళం చెక్కును అమరావతిలో సీఎం చంద్రబాబుకు అందజేశారు. మత్స్యకార సంఘ నాయకులను సీఎం చంద్రబాబు అభినందించారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి మురమళ్ల శ్రీనుబాబు, ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ అంపోలు సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు సోమశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మండాది వెంకటగిరి, ఉత్తరాంధ్ర చైర్మన్ సిద్ధాంతపు అప్పారావు, తాతపూడి వెంకటరమణ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోట్నూరి వీరవెంకటసత్యనారాయణ, కాటా సత్యనారాయణ, జంపా నాగేశ్వరరావు, పాండ్రంకి సత్యనారాయణ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పి.గన్నవరం, సెప్టెంబరు19: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతులకు జన్మనిస్తారని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీవో ఎం.భారతీ, సీడీపీవో వెంకటేశ్వరిలతో కలిసి ఎమ్మెల్యే గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. బొండాడ నాగమణి, హెచ్‌వీ మరియమ్మ, ఏఎన్ఎం అమ్మాజీ, సూపర్‌వైజర్స్ పీఎస్ పద్మావతి, జ్యోతి, పుణ్యవతి పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

రావులపాలెం, సెప్టెంబరు19: వెదిరేశ్వరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. తొలుత పౌష్టికాహార ఆవశ్యకతను వివరించి పౌష్టికాహారాన్ని అందించారు. సర్పంచ్ బొక్కా కరుణాకరం, ఎంపీటీసీ గంటా సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ బొక్కా వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఎం.సాయిరామ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బాపూజీ



రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 19: ప్రభుత్వ ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడిగా మద్దాల బాపూజీ ఎన్నికయ్యారు. అమలాపురంలో గోదావరి భవన్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.సూర్యనారాయణ అధ్యక్షతన ఇటీవల జరిగిన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సమావేశంలో బాపూజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బాపూజీ తెలిపారు.

ఓడలరేవు తీరంలో మెరైన్ గస్తీ

అల్లవరం, సెప్టెంబరు 19: ఓడలరేవు తీరంలో ఆకతాయిలు సముద్ర జలాల్లోకి స్నానాలకు వెళ్లవద్దని, మెరైన్ బృందం గస్తీ కొనసాగిస్తారని మెరైన్ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి అన్నారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన మూర్తి మెరైన్ ఎస్ఐలు జి.విలియమ్స్, సీహెచ్ చినబాబు బృందంతో కలిసి ఓడలరేవు తీరంలో పర్యటించారు. తీర గ్రామాల్లో అనుమతులు లేకుండా అక్రమంగా ఆయిల్ తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి

అయినవిల్లి, సెప్టెంబరు 19: పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీనివాస్ అన్నారు. గురువారం అయినవిల్లిలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు, పంచాయతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర శ్రీనివాస్, పంచాయతీ విస్తరణాధికారి వాణిశ్రీ బెహరా, కార్యదర్శి కొంకి రామచంద్రరావు, ఉప సర్పంచ్ పోలిశెట్టి రాజేష్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్లూకోమీటరు, థర్మామీటర్లు అందజేత

కపిలేశ్వరపురం, సెప్టెంబరు19: అచ్యుతాపురం పీహెచ్‌సీపరిధిలోని వల్లూరు ఆరోగ్య ఉపకేంద్రానికి గురువారం గ్లూకోమీటరు, 4థర్మామీటర్లు అందజేశారు. వల్లూరు గ్రామస్తులు, జుపాస్ ఫౌండేషన్ నిర్వాహకులు వీవీ ప్రసాద్, సత్యశ్యామల అమ్మమ్మ వల్లూరు లక్ష్మి వీటిని అందజేశారు. గతంలో డీపీ ఆపరేటర్స్‌ను అందజేశారు. దాతలకు పీహెచ్‌సీ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీహెచ్‌ఈవో గోపాలకృష్ణ, ఎంపీహెచ్ఎస్ శ్రీధర్, ఏఎన్ఎం స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఆశాలు ఎస్.విజయ, కె.పుష్పవతి, పి.సత్యవేణి, ఎం.పద్మ పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మల్లికార్జునరావు మృతి



రామచంద్రపురం(ద్రాక్షారామ), సెప్టెంబరు 19: మాజీ కౌన్సిలరు గంపల మల్లికార్జునరావు(63) అనారోగ్యంతో విజయవాడలో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన రెండు సార్లు కౌన్సిలర్‌గా, ఒకసారి కోఆప్షన్ సభ్యుడిగా పనిచేశారు. ప్యానల్ చైర్మన్‌గా, కృత్తివెంటి పేర్రాజుపంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టు సభ్యుడిగా పనిచేశారు.

మాజీ సర్పంచ్ మృతి

కాట్రేనికోన, సెప్టెంబరు 19: కాట్రేనికోన మాజీ సర్పంచ్ మోకా చక్రధరరావు గురువారం మృతి చెందారు. ఆయన 11ఏళ్లు సర్పంచ్ పదవిలో ఉన్నారు. ఆయనకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి పలువురు విచారం వ్యక్తం చేశారు.

రక్తదాన శిబిరం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 19: ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా జిల్లాశాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ఆధ్వర్యంలో గురువారం అమలాపురం ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. యువమోర్చా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు మాట్లాడుతూ యువతకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలను అమలు చేస్తుందని వివరించారు. రక్తదాన శిబిరంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, రాష్ట్ర కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి, గనిశెట్టి అరవింద్, బొంతు శివాజీ, జగతా శాంతి, అరిగెల తేజ పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.55వేలు విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు 19: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి ఆర్తమూరుకు చెందిన వెలగల వెంకటరెడ్డి- మంగాయమ్మ దంపతులు రూ.55వేలు విరాళం సమర్పించారు. దాతలకు ఉపకమిషనరు స్వామివారి చిత్రపటం అందజేశారు.

24న ఉచిత వైద్య శిబిరం

మండపేట, సెప్టెంబరు19:రాజానగరం జీఎస్ఎల్ మెడికల్ కళాశాల సౌజన్యంతో జమాతే ఇస్లామీహింద్, మండపేట రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మండపేటలో ఈనెల24న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు జమాతే జిల్లా అధ్యక్షుడుఅమీర్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు యిమ్మిడిశెట్టి నాగభూషణం తెలిపారు.